# తీర్థయాత్ర

మలయాళ మూలం: వైశాఖన్

తెలుగు సేత: ఎల్. ఆర్. స్వామి

## "శ్రీ వెంకటాచలపతే, తవ సుప్రభాతం!"

మైకులు ఒకేసారి గొంతెత్తి పాడాయి. అనంతమైన నీలాకాశంలో విస్తరించి, మంచులో కరిగి, నేలమీదకి, జారింది, సుప్రభాతం. ఆకాశమే పైకప్పుగా, రాత్రి నేలపై నిదురించినవాళ్ళ కన్నుకలలు మెల మెల్లిగా కరిగిపోయాయి. పడకగదులలోని "ఏ.సి" గాలికి సుగంధం అద్దటం కోసం వెదజల్లిన రసాయన వస్తు పీలుస్తూ, పడక గదుల కిటికీ తెరలను, సున్నితంగా జరిపి, కిటికీ రెక్కలకు అంటుకునే నీటిబిందువులని చూసి జీవితాన్ని ఆస్వాదిస్తూ, తీర్థయాత్రకి వచ్చినవారు, నమస్కారం చేసారు.

"తవ సుప్రభాతం!"

దేవుని నిర్ణయం వల్ల, అద్దె ఇవ్వలేనివారి కోసం నిర్మించబడిన సత్రాల వసారాలలో, సుప్రభాతపు వెలుగునీడలు గీసింది. పూర్వజన్మలో, చేసిన పాపఫలితంగా అక్కడ పడుకోవలసివచ్చిన రాజు, ఉబ్బుకుపోయిన కళ్ళతో, లేచాడు. నెరిసి మాసిపోయిన దాడి ఒకసారి తడుముకున్నాడు. దాచివుంచిన వాడిన బంతిపూదండ తీసి మెడలో వేసుకున్నాడు. మరో రోజు మొదలైంది, అతనికి.

చాలా నిర్మలంగా వున్న ఆకాశం కింద, కష్టాలలో కూరుకుపోయిన మానవుల నుంచి దూరంగా, తల యెత్తి నించుంది కొండ. అనంతము, అజ్ఞాతమువైన ఆశీస్సుల ఘంటారావం సర్వజీవులని ఓదారిస్తూ కొండమీద నుంచి జాలువారింది.

తీర్థయాత్ర కోసం వచ్చినవారు, రేల్వేస్టేషన్‌లో దిగారు. "ఏ.సి." గదుల తలుపులు తెరిచి కష్టాలు నిండిన ప్రపంచంలోకి పరుగు పెట్టారు కొందరు. మరికొందరు రిజర్వేషన్ లేని మూడో తరగతి కంపార్టుమెంటుల కష్టాలలో నుంచి స్వతంత్రులైనారు. బస్సులు వరసగా నిలబడ్డాయి, పైకప్పు లేని ఎద్దు బళ్ళు కూడా!


పనివారు మోసుకొచ్చిన తివాచీలు పార్కులో పరిచి కొందరు కూర్చొని వున్నారు. "తెర్‌మల్" జగ్గుల నుంచి నీరు తాగుతూ "పోర్‌టబుల్ రెక్కార్డులలో నుంచి భక్తిగీతాలు వింటున్నారు, వారు. ఎద్దుబళ్ళవారు, ఆ గీతాలు వింటూ చెట్టునీడన నిలబడ్డారు.

కథ



మూడో రోజు మొదలైంది, రాజుకి. అతని కథ అందరికి తెలిసినదే! మొదటిరోజు బండి దిగకముందే, అతనికి దేవుడిచ్చిన శిక్ష మొదలైంది. తెచ్చుకున్న పెరుగన్నం దొంగిలించబడింది. ఖర్చు కోసం జేబులో వుంచిన డబ్బు ఏ భక్తుడో కొట్టేసాడు. టికెటు కలెక్టర్ కూడా స్టేషన్‌లో ప్రతాపం చూపాడు. సర్వాంగాలు వెతికినా, రూపాయి కూడా దొరకలేదనే కోపంతో మెడ మీద ఒక తన్ను తన్నాడు. స్టేషన్ బయటకు వచ్చి పడ్డాడు రాజు. అప్పుడప్పుడే మంట అంటుకునే ఎండలో నిలబడి, కొండవైపు చూసి మనస్సులో, అనుకున్నాడు:

"దేవుడా, నీ దర్శనం కోసం రాజు అనే ఈ పేదవాడు కూడా వచ్చాడు. మా వారసత్వానికి వ్యతిరేకంగా భక్తిమార్గంలో చేరిన వాడిని, మన్నించాలి. మా తండ్రి మొండితనం నీకు తెలుసు. ఏ పని సమంగా, సక్రమంగా చెయ్యకపోవటం అతని మొదటి మొండితనం. ఒక రైల్వే దొంగగా బ్రతికాడు, అతడు. అతడి పెళ్ళాం- అదే మా అమ్మ- దొంగలకి పోలీసోళ్ళకి దొంగసారా, కాచి పోసి పతిసేవ చేసింది. రైల్వే వాగనులు పగలుకొట్టే శక్తి కోల్పోయాక, ఒకరోజు, పరిగెట్టే బండి నుంచి పడిపోయాడు. ఆ తరువాత లేచి నడవలేదు. కొన్నేళ్ళు నాల్కాలిగాను, మరికొన్నేళ్ళు పాకే జీవిగాను, రెండు జన్మలు గడిపాడు. చివరికి ఒక మిట్టమధ్యాహ్నం, మట్టిలో దొర్లుతూ, కాళ్ళు సేతులు కొట్టుకుంటూ, ప్రపంచాన్నంతా బూతులు తిట్టుకుంటూ, ఇక కదలడని మొండికెత్తాడు. ఎలాగో, అతడు జగమొండి కదా, ఇక కదలడని తెలిసిన పొరుగింటివారు, ఇతరులని బాధ నుంచి తప్పించటం కోసం శ్మశానానికి తీసుకెళ్ళి ఒక మూలలో పాతిపెట్టారు. దేవుడా, ఒక మనవి. నేను నాన్న వారసత్వాన్ని నిలబెట్టలేను. దొంగసారా కాచని ఒకామెని పెళ్ళి చేసుకున్నాను. పిల్లలని బడికి పంపటం కోసం కష్టపడ్డాను. వాళ్ళకి ఆకలిబాధ వుండకూడదని అనుకున్నాను. టీ బడ్డి పెట్టాను. నెత్తురిని, నీరుగా మార్చి రైల్వేకూలీలకు వేడి వేడి ఇడ్లీలు, టీ చేసి



ఇచ్చాను- అప్పుగా. వారు హాయిగా తిని పొగడుతూ వుంటే పొంగిపోయాను. జీతం అందుకున్న రోజు కూలీలు పిచ్చివారలా పరిగెడుతూ వుంటే చూసి నిలబడ్డాను. బడ్డికి రావాలని కాని, అప్పు తీర్చాలని కాని సారా మైకంలో వున్నవారికి గుర్తుండేది కాదు. ఇడ్లీలకు బియ్యంలేని రోజు దేవుడు గుర్తొచ్చాడు, నాకు. వెంటనే భక్తుడుగా మారి దేవుణ్ణి తలచుకుంటూ రైల్వే పట్టాల మీదుగా స్టేషన్ వైపు నడిచాను. దేవుడు కరుణించాడు. ఒక వాగన్ కిందపడి వున్న బియ్యంగా ప్రత్యక్షమైనాడు. మా నాన్న స్నేహితులు రాత్రి తీసుకొనివెళ్ళగా మిగిలినది ఆ బియ్యమని గుర్తించి ఊడ్చి కండువాలోకి ఎత్తుతూ వుండగా వినబడింది పోలీసు విజిల్. పోలీసోళ్ళు కేసు దొరికింద ని సంతోషించారు. కొన్ని నెలలు వాళ్ళ ఖర్చుతో గడిపాను. బయటకు రాగానే పిల్లలు ముష్టి యెత్తటం చూసాను. పిల్లల ఆకలిని తన ఆకలిని తీర్చటం కోసం ఇతరుల శృంగారాకలిని తీర్చే భార్యని కూడా చూసాను. వెంటనే వచ్చాను, ఇక్కడకి. పూర్వజన్మలో పాపాలు, ఈ జన్మలో పాపాలు మూటగా మోస్తూ, ఆ మూట నీ పాదాల వద్ద దించి వెళ్ళాలనేది నా ఉద్దేశం. దొంగతనాలు, అన్యాయాలు చెయ్యకుండా బతకటానికి నీ ఆశీస్సులు కావాలి".

దుమ్ము, ధూళి చేరిన దాడితో, చిరిగి మాసిన బట్టలతో, నిలబడ్డాడు రాజు. చేతిలో చిల్లిగవ్వ లేదు ధర్మదర్శనమే శరణ్యం. రెండు రోజులుగా ధర్మదర్శనం గురించి ప్రయత్నిస్తున్నాడు. అతడు గర్భగుడి వద్దకు రాగానే ముగుస్తుంది దర్మదర్శనం. దొరకని వస్తువుపై మోజు పెరుగుతున్నట్లు, దొరకని దర్శనంపై తపన పెరిగింది. ముష్టి ఎత్తయినా డబ్బు సంపాదించి, టికెటు కొని దర్శనం చెయ్యాలనే నిర్ణయానికి వచ్చాడు.

తీర్థయాత్రికుల సముద్రఘోష వినబడింది కొండ కింద.

చుట్టూ చూసాడు రాజు. మైదానంలో, యాత్రికులు విశ్రాంతి తీసుకుంటున్నారు. జుట్టు నెరిసిన ఒక జంట, ఇద్దరు అమ్మాయిలతో కూర్చొని రొట్టెలు తినటం గమనించి వారి వద్దకు చేరాడు.

"ఈరోజు పేపర్‌లో ఋన ప్రకటన వచ్చిందే" భర్త అంటున్నాడు.

"చూడు. వాంటేడ్ స్మార్ట్ పెళ్ళికొడుకు, అందగాడు, పోస్టు గ్రాడ్యుయేట్, ఫర్ 35 సంవత్సరాల అందగత్తెన అమ్మాయికి... శ్రీవత్స గోత్రం... బ్యాంక్ ఆఫీసర్... వెంటనే పెళ్ళి..."

పెద్దమ్మాయి ఎదురుగా వున్న గుడి గోపురంవైపు దృష్టి మళ్ళించింది. సమయం రాకముందే ఎండిన ఒక గడ్డిమొక్క తుంచి నోటిలో పెట్టుకొని తల దించింది. చిన్నమ్మాయి ఆ మాటలు పట్టించుకోలేదు.

"విడాకులు తీసుకున్నదని వ్రాయలేదా?" భార్య అడిగింది.

"పొరపాటైందిలే..." తల దించుకొని అన్నాడు భర్త. "ఈ చిన్న పొరపాటుని దేవుడు క్షమిస్తాడులే".

"ఏమో... అయినా, అంతా మీ ఇష్టమేగా..." భార్య జవాబు.

రాజు చేతులు జాపాడు. అతని చేతులో పావలా పడింది.

"పాపం" భర్త అన్నాడు. "ఎలా వున్నాడో చూడు. దేవుడిచ్చిన క్ష- శిక్ష అనుభవిస్తున్నవాడిని చూడు".

రాజు కదిలాడు. రద్దీ వున్న చోటుకు వెళ్ళాలి. "రోప్వే" వద్ద వున్న స్సు స్టాపులో జనం గుమిగూడి వుండటం చూసి అక్కడకి చేరా ు. "రోప్వే" పని చెయ్యటం లేదు. కొందరు బాగు చెయ్యటం ోసం పని చేస్తున్నారు గాని వారిని ఎవరూ పట్టించుకోవటం లేదు. యంత్రాలకు పసుపు కుంకుమలు అద్ది హారతులిచ్చి యంత్రాలు పని చెయ్యటం గురించి ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు.

"పైన హెలిపాడ్ పని ఎంతవరకు వచ్చింది?" -ఒకడు.

"తొందరలోనే పూర్తి అవుతుందట!"

"హమ్మయ్యా... తొందరగా పూర్తి అయితే బాగుండును. ఇబ్బంది పడకుండ వచ్చి దర్శనం చేసి వెళ్ళవచ్చును".

చేయి జాపాడు రాజు. కాని చేతులోకి పైసా పడలేదు. తీర్థయాత్రకి వచ్చి వెళ్ళటానికి పడే ఇబ్బందులు గురించి, వేడివేడిగా

**రాజు కదిలాడు. రద్దీ వున్న చోటుకు వెళ్ళాలి. "రోప్వే" వద్ద వున్న బస్సు స్టాపులో జనం గుమిగూడి వుండటం చూసి అక్కడకి చేరాడు. "రోప్వే" పని చెయ్యటం లేదు. కొందరు బాగు చెయ్యటం కోసం పని చేస్తున్నారు గాని వారిని ఎవరూ పట్టించుకోవటం లేదు. యంత్రాలకు పసుపు కుంకుమలు అద్ది హారతిలిచ్చి యంత్రాలు పని చెయ్యటం గురించి ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు.**

చర్చించుకునే వారిలో ఒకడు రాజుని చూసి అన్నాడు. "నాన్సెన్స్, ఏ గుడికెళ్ళినా ఇదే సమస్య- ధర్మం చెయ్యండి" అంటూ వెంట పడతారు.

తైలవర్ణ చిత్రాలు అమ్మేచోట కనబడిన జనం రాజుని అటు నడిపించింది. ఇండియన్ ఇంకులో ముంచి నిర్లక్ష్యంగా గీసిన ఒక చిత్రంలా అక్కడకి చేరాడు రాజు. నడివయస్సులో వున్న ఒక భక్తుడు, అతని భార్య చిత్రాలని తిలకిస్తూ నడుస్తున్నారు. చిత్రాల చుట్టూ, నడిచి నడిచి అలసిన ఆమె నుదుటి మీద కుంకుమ చెమటలో కరిగిపోయి వుంది. వెతికి వెతికి, ఆవిడ మర్రిఆకుపై నిదురించే కృష్ణుని చిత్రం కొనుక్కున్నారు.

తన అంతస్తుకు ప్రతీకగా మెరిసే వెండి ఊతకర్రతో నడుస్తూ చిత్రాలని పరిశీలించే ఒక ముసలివాడు ఒక చిత్రం కొనుక్కున్నాడు. శివలింగాన్ని గట్టిగా కౌగలించు కున్న మార్కొండేయుని చిత్రం అది. చిత్రంలో, మార్కొండేయునికి, కొంత దూరంగా, నిరాశగా నిలబడిన యముని చూసి చమటలు కక్కాడు అతడు.

**తెల్ల మచ్చలు**

క్రొత్తగా కనిపెట్టబడిన ఈ మందులు వాడటం వల్ల 100% గ్యారెంటీ వుంటుంది. 20 గం.లలో తప్పకుండా మీ చర్మం యొక్క రంగు మారుతుంది. 15 రోజుల వరకు మందులు ఉచితం. అత్యవసర చికిత్స కొరకు ఇంగ్లీషులో ఫోన్ ద్వారా సంప్రదించండి.

వైద్య MK మాథుర్(5)
P.O. కత్రి సరాయి, (గయా)
ఫోన్ : 06312433806 (M) 09905950792, 09934750600

ఆయాసం, ఆందోళన పెరిగింది. పక్కనే వున్న పనివాడు, ఒక పెట్టె నుంచి ఆరు మాత్రలు తీసి, ఒకటి తరువాత ఒకటి ముసలివాడి ముడుచుకుపోయే చేతిలో పెట్టాడు. మాత్రలు చేతిలో వుంచుకొని కొండవైపు చూపులు నిలిపి, ప్రార్థన చేసి మాత్రలు మింగాడు, అతడు.

నాలుగు వేళ్ళకి వజ్రపు ఉంగురాలు తొడుక్కున్నవాడు చిత్రాలని పరిశీలించాడు. నోటుకట్టలపై వజ్రాల ఆభరణాలపై పాదాలు మోసిన దేవుని చిత్రమే అతనికి నచ్చింది.

రాజు యాచించాడు, కాని ఎవరూ పట్టించుకోలేదు. పావలైనా చేతులో పడలేదు.

ఇద్దరు మాటలాడుకోవటం విని, వాళ్ళని సమీపించాడు, రాజు. ఒకడు జరీ అంచుల పట్టుపంచ కట్టుకున్నాడు. వెండి జరీ కండువా వేసుకున్నాడు. రోడ్డువారగా కూర్చున్న ఒకడు అతని చెయ్యి చూసి చెప్తున్నాడు.

"ఏమి బెంగవొద్దు సార్, ఇంకా ఆశ వుంది..."

అతనికి వొంగి దండం పెట్టాడు రాజు. తన విషాదకథ చెప్పాడు. తనకి మంచి రోజులెప్పుడు వస్తాయని అడిగాడు.

"నీవెప్పుడు, పుట్టావు? నెల, తేది..."

రాజు ఏదో అన్నాడు.

"అయితే లియో కావచ్చు. నీకు అదృష్టం తగలాలంటే ముదురు నీలిరంగు ధరించు. నీ అదృష్టసంఖ్య పదకొండు. అన్ని పదకొండు వచ్చేలా, చూడు. పదకొండోవాడిని అడుగు. పదకొండు గంటలకి దర్శనం చేసుకో. పదకొండు నిన్ను రక్షిస్తుంది" అతడు ఒక నిమిషం ఆగాడు. ఆ తరువాత అన్నాడు "పువర్ గై, ఇదిగో, పదకొండు పైసలు".

పైసలు అందుకొని నడిచాడు, రాజు. కొండ ఎక్కవలసిన సమయమైంది. పగటిపొయ్యిని ఊది మంట పెంచుతోంది, గాలి. ఆకలి మంటలు అంటుకున్నాయి. ఎండ, వేడిగాలి, మంత్రఘోష అంతా కలసి, ఒకేసారి రాజుని ఆక్రమించాయి. ఆకలికి నీరసించిన అతడు కొండ ఎక్కుతూ వుంటే ఆకాశపు మేడ మీద నుంచి సూర్యుడు ఎగతాళిగా చూసాడు.

కొండ ఎక్కాడు రాజు. ఆకాశంలోని సూర్యుడి ప్రతాపం పెరిగింది. పూర్వజన్మ పాపఫలాలు అనుభవించే అతని పాదాలకు, దారిలోని రాళ్ళు సూదులుగా గుచ్చుకున్నాయి.

కరపత్రాలతో, రోడ్డువారగా నించున్న ఒకడు రాజుని పలకరించాడు.



**రాజు కదిలాడు. రద్దీ వున్న చోటుకు వెళ్ళాలి. "రోప్వే" వద్ద వున్న బస్సు స్టాపులో జనం గుమిగూడి వుండటం చూసి అక్కడకి చేరాడు. "రోప్వే" పని చెయ్యటం లేదు. కొందరు బాగు చెయ్యటం కోసం పని చేస్తున్నారు గాని వారిని ఎవరూ పట్టించుకోవటం లేదు. యంత్రాలకు పసుపు కుంకుమలు అద్ది హారతిలిచ్చి యంత్రాలు పని చెయ్యటం గురించి ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు.**

"ఇదిగో, బ్రదర్" అతడు స్నేహపూర్వంగా, మృదుమధురమైన గొంతుతో అన్నాడు. "ఇది చదువు. నీకు పుణ్యం వస్తుంది. విను ఇది చదివి నిన్నటివరకు జోగారావుగా వున్నవాడు, జోసెఫ్ అయ్యాడు. మహా పాపి పరిశుద్ధుడై స్వర్గం చేరాడు. ఇదే పాపికున్న ఒకే ఒక మార్గం".

కరపత్రం అందుకొని గబగబ నడిచాడు రాజు. భక్తులని మోసే కారులు, బస్సులు అతని వెనక్కు నెట్టి ముందుకు సాగాయి. కొండ ఎక్కాక తెలుసుకున్నాడు, ఆరోజు కూడా ధర్మదర్శనం కుదరదని.

రాజు బాగా అలసిపోయాడు. నీరసం అతని శరీరాన్ని మింగి వేసింది. గొంతు తడియారింది, నీరు తాగాలని పాపవిమోచన సరస్సు వద్దకు కాళ్ళు ఈడ్చుకుంటూ నడిచాడు. ఒడ్డున చితికిలబడ్డాడు. మరికొంత సమయంలో టికెటు దర్శనం కూడా ముగుస్తుంది. దర్శనం చేసుకోకపోతే పాపవిమోచన ముండదు. ఏం చేయటం?

యుగాలెన్ని గడిచినా, తలుపులకు ఇవతల వుండే సామాన్య జనానికి అందుబాటులో లేక, ఏమి తెలియనట్లు తలుపులకు అవతలే కూర్చుంటాడు, దేవుడు!

సరస్సు వద్ద చాలా జనమున్నారు. వజ్రపు ఉంగరాల వాడి కాలు రాజుకి తగిలింది. అతని మాటలు చెవులో పడ్డాయి "ఇరుపతికి కాంట్రాక్టు. పదకొండులో అయిపోవాల ఇదిగో..." పదకొండు రూపాయి బిళ్ళలు సరస్సులోకి విసిరాడు అతడు.

రాజు పాదాలు వొణికాయి, కదిలాయి. నివురు కప్పిన ఆకలి చెలరేగింది. కళ్ళు మెరిసాయి. మెడలోని వాడిన బంతిపూదండ ఊగిసలాడింది.

సరస్సులోకి దూకాడు. యుగయుగాలుగా భక్తుని కోసం నిలిచిన సరస్సు నోరు తెరిచి ఆహ్వానించింది. అతని కాళ్ళు చేతులు కొట్టుకున్నాయి, కాసేపు. ఆ తరువాత కళ్ళు పైకి తేలాయి.

"గోవిందా, గోవిందా..." ఒడ్డున భక్తులు.

"ఏమిటీ శిక్ష..." ఒకడు.

రాజు నీళ్ళలో మునిగి అప్రత్యక్షమైనాడు.

గంటలు మోగాయి. పంచలోహాలలో నుంచి వచ్చిన శబ్దం మెల మెల్లిగా వాయులీనమైంది.

## రచయితలకు సూచనలు!

* మీ రచనలను కాగితాలకు ఒకవైపున మాత్రమే రాయాలి.
* జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.
* మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
* అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.
* మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జతపరచాలి.
* ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకునేవారు తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.
* రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
* ఆరోగ్యకరమయిన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.

మీ రచనలు పంపించవలసిన చిరునామా:

**ఆదివారం వార్త,**
ఎడిటర్
'వార్త' తెలుగు దినపత్రిక,
లోయర్ ట్యాంక్‌బండ్,
హైదరాబాద్- 500 080